
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందిగా చర్యలు..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకలను, దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందిగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ సన్నద్ధతపై సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా ఎస్పీ కె.మనోహర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని అన్ని రైతు వేదికలకు మామిడి తోరణాలు, విద్యుద్దీపాలంకరణతో అందంగా అలంకరించి జూన్ 3వ తేదీన తెలంగాణ రైతు దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు రోజుకో శాఖ చొప్పున ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, 3న రైతు దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ విజయవంతం చేయడానికి మండల స్థాయి నోడల్ అధికారులు కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో దశాబ్ధి ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ అవిర్భావ దినోత్సవం నుంచి అమరుల సంస్మరణ దినోత్సవం వరకు ప్రజలు, ప్రజా ప్రతినిధులను, అధికారులు, మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ జిల్లాలో దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, మోతిలాల్, అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్, మరో అడిషనల్ ఎస్పీ భరత్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి: కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** జూన్ 2 నుండి 22 వరకు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలులో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల గురించి జిల్లా ఎస్పీ సృజన, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, డా అబ్రహాంలతో కలిసి ఉత్సవాల నిర్వహణపై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులు సమన్వయంతో దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గత తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిపై ప్రణాళికా బద్ధంగా అన్ని శాఖలు స్పీచ్ తయారు చేసుకుని ఆయా తేదీలలో వారి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలలో మాట్లాడాలని తెలిపారు. ప్రతిశాఖ వారిగా ప్రోగ్రాం యాక్టివేట్ చేసుకుని మెటీరియల్ సిద్ధం చేసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గొర్రెల పంపిణీ ప్లాట్‌ల పంపిణీ తదితర సంక్షేమ పథకాల పంపిణీ ఆయా శాఖల వారిగా సిద్ధం చేసుకోవాలన్నారు. 2వ తేదీన అమవీరులకు నివాళులర్పించిన అనంతరం 9 గం.లకు కలెక్టర్ కార్యాలయంలో పతాకావిష్కరణ, పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్య అతిథులుగా పాల్గొనే మంత్రి ద్వారా జెండావిష్కరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 3న రైతు దినోత్సవం సందర్భంగా రైతు వేదికల వద్ద వెయ్యిమంది రైతులతో రైతు సంక్షేమం గురించి వారికి వివరించాలన్నారు. రైతు వేదికలను తోరణాలు అందమైన లైట్లు ముస్తాబు చేయాలన్నారు. రైతులకు జరిగిన అభివృద్ధి పనులపై వివరించాలని వ్యవసాయ అధికారులు హార్టికల్చర్ అధికారులను పాల్గొనేలా చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రాములు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## నేడు మంత్రి తన్నీరు హరీష్‌రావు రాక...

**అచ్చంపేట, మే 29 ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రి, డబుల్ బెడ్ రూం ఇండ్లను, సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించడానికి మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు రానున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మంత్రి హరీష్‌రావు రానున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభ స్థలిని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరిశీలించారు. సభ ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు చేపట్టారు.



సభ స్థలిని పరిశీలిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# పెద్దాసుపత్రితో ప్రసవ వేదన ఆగేనా..!

- **గర్భిణీల మృతి నియంత్రించేలా చర్యలు ఉంటాయా.?**
- **100 పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పిస్తారా.?**
- **ఎన్నికల కోసమే 100 పడకల ఆసుపత్రి ప్రారంభమా.!**
- **100 పడకల ఆసుపత్రితోనైనా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేనా.**

**అచ్చంపేట, మే 29 ప్రభాతవార్త:** సర్కార్ దవాఖానాలో ప్రసవాలు చేయించి ఆరోగ్యంగా తల్లిబిడ్డలు ఇంటికి సురక్షితంగా చేరే విధంగా ప్రభుత్వం అన్ని రకాలుగా అందుబాటులో ఉంటుందని ప్రసంగాలు చేస్తున్నారే తప్ప ఆసుపత్రిలో కాన్పు కోసం వచ్చిన గర్భిణీలపై ఆసుపత్రి సిబ్బంది దాడులకు పాల్పడటం, వైద్యం వికటించి తల్లిబిడ్డలు మృత్యు ఒడిలోకి చేరడం పరిపాటిగా మారుతోంది. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతినిత్యం 24 గంటలు వైద్య సేవలను అందుబాటులో ఉంచాల్సిన పాలకులు వైద్య ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడంతో పేద ప్రజలకు వైద్యం అందుబాటులోకి రాకుండా పోతుందని చెప్పుకోవచ్చు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో జీవించే ప్రజలంతా రెక్కాడితే కానీ డొక్కాడని పేద ప్రజలు చెంచు పెంటల్లో జీవిస్తున్న ప్రజలు ఆరోగ్య సమస్యలపై సర్కార్ దవాఖానాకు వస్తే ఆ దవాఖానాలో పరీక్షలు చేసే వైద్యం అందించే వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఎంతో మంది అభాగ్యులు మృత్యువు ఒడికి చేరుతున్న సంఘటనలు కొకొల్లలు. ఇందుకు ఉదాహరణ... నల్లమల్ల అటవీ ప్రాంతం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో 30 పడకల ప్రభుత్వాసుపత్రి. ఈ ఆసుపత్రికి అచ్చంపేట పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు చెందిన పేదింటి ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రికి చేరుకుంటే ఎంతో మంది విఘతజీవులుగా మారి ఇంటికి చేరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కాలంలోనే ప్రసవం కోసం పురిటినొప్పులను అనుభవిస్తూ తల్లడిల్లుతూ ఆసుపత్రికి వస్తే గర్భిణీలపై ఆసుపత్రి సిబ్బంది చేయి చేసుకొని గాయాలపాలు చేసి బిడ్డ ప్రాణాలను బలిగొన్న సంఘటన చోటు చేసుకుంది. ఇది ఇలా ఉంటే మరో గర్భిణీ ప్రసవ వేదన భరిస్తూ మరికొద్ది క్షణాల్లో మరో జీవికి జన్మనిస్తున్న అనే ఆనంద పడుతున్న సమయంలోనే తల్లిబిడ్డలు మృత్యువు ఒడిలోకి చేరారు. ఇదంతా ఆ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం, ఆసుపత్రిలో సరైన సదుపాయాలు లేకపోవడమే కారణమా.? ఈ ప్రాంతంలో ప్రతినిత్యం శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారిపై ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకొని కొంత మంది ప్రయాణీకులు మృత్యువాత పడగా మరికొంత మంది క్షతగాత్రులుగా మిగులుతుంటే వారికి ప్రథమ చికిత్స నిర్వహించేందుకు కూడా కనీస వసతులు లేక, సమయానికి ఆసుపత్రులో వైద్యులు, సిబ్బంది లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వాసుపత్రిలో కనీసం శస్త్ర చికిత్స నిర్వహిస్తే కొంత మందైన మెరుగైన వైద్యం చేయించుకొని బ్రతికే వారని పలువురు పేర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి ప్రసవ కేసులలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంటుంది. జిల్లా కేంద్రంలో ఉన్న ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించి ఎవ్వరికి ఎలాంటి లోటు లేకుండా వైద్య సిబ్బంది 24 గంటల ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేస్తుంటే... నల్లమల్ల వెనుక బడిన ప్రాంతంలో ఉన్న అచ్చంపేట 30 పడకల ఆసుపత్రి మాత్రం మృత్యువులకు నిలయంగా మారింది. అచ్చంపేట ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్లాలంటేనే అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురై చికిత్స కోసం వెళ్తే... ఇంటికి ప్రాణాలతో తిరిగి వస్తామా అనే అనుమానాలతో కొట్టుమిట్టాడుతున్నారు. అచ్చంపేట ఆసుపత్రిలో చికిత్సకోసం వచ్చిన మహిళలు, శిశువులు మృతి చెందిన కూడా ఇక్కడి పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధు లు వైద్య సిబ్బందిపై చర్యలు చేపట్టకపోవడం వైద్య సిబ్బందికి కలిసొచ్చిన అంశంగా చెప్పుకోవచ్చు. ప్రజల ప్రాణాలంటే పాలకుల కు, అధికారులకు లెక్క లేదా అనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 100 పడకల ఆసుపత్రి

**ఎన్నికల కోసమే 100 పడకల ఆసుపత్రి ప్రారంభమా.!**

**100పడకలఆసుపత్రితోనైనా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేనా.**

30 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికి ఆ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడం ప్రజలకు అవసరమగు సదుపాయాలు లేకపోవడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయినప్పటికి సదుపాయాలను సమకూర్చ లేని నిస్సాహాయ స్థితిలోఉన్న పాలకులు, వైద్యశాఖ జిల్లా ఉన్నతాధికారులు, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో 100 పడకల ఆసుపత్రిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా నేడు ప్రారంభించనున్నారు. కనీసం 100 పడకల ఆసుపత్రిలోనైనా వైద్యులు, వైద్య సిబ్బంది, మెరుగైన వైద్య సదుపాయాలను సమకూర్చి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తారా లేక గతంలో జరిగినట్లే ప్రజల ప్రాణాలు కోల్పోవాల్సిందేనా. నల్లమల్ల ప్రాంతం వెనుకబడిన ప్రాంతం కావడంతో ఇక్కడ జీవనం కొనసాగిస్తున్న ప్రజలు సుస్తి అయితే కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని దీన స్థితిలో ఉన్నవారే. ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడం వలన అప్పొ, సొప్పొ చేసి ప్రాణాలను కాపాడుకుందామని ప్రైవేటు దవాఖానాలకు వెళ్తే ఇదే అదునుగా కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు జలగల్లా రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ ప్రజలను అందిన కాడికి దోచుకుంటూ నట్టేట ముంచుతున్న కూడా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు మాత్రం పట్టించుకున్న పాపన పోలేదు. అచ్చంపేటలో 100 పడకల ఆసుపత్రి దిష్టిబొమ్మగా మారనుందా.! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నప్పటికి అచ్చంపేటలో మాత్రం వైద్యం రంగంపై ఎందుకు దృష్టి సారించడం లేదు. వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్న కూడా మెరుగైన వైద్యం అందించి ఈ ప్రాంత ప్రజలను కాపాడుకుందామనే ఆలోచనలు పాలకులకు రాకపోవడం దురదృష్టకరం. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి జిల్లా ప్రజలందరికి వైద్యం అందించాలనే సంకల్పంతో నిర్మించారు కానీ ఈ ఆసుపత్రి ద్వారా నల్లమల్ల ప్రాంత ప్రజలకైనా మెరుగైన వైద్యం అందుతుందా, లేక గతంలో 30 పడకల ఆసుపత్రి లాగా పరిస్థితి మారుతుందా.? కనీసం ఇప్పుడైన 100 పడకల ఆసుపత్రిలో ప్రజలకు అవసరమగు అన్ని విధాల సదుపాయాలను, వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పలువురు కోరారు.



వైద్యం అందక మృతి చెందిన గర్భిణీ, శిశువు ఫైల్

# దశాబ్ది ఉత్సవాలు అద్భుతంగా నిర్వహించాలి..

**ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో సాగాలి**
**జూన్ 2 నుండి 22 వరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు**
**మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలలో విజయవంతం చేద్దాం**
**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పిలుపు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2తో 10 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా నాటి ఉద్యమ నాయకుడు, తెలంగాణ రాష్ట్రంకోసం పోరాటం చేసిన నేటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సూచనలు,ఆదేశాలమేరకు జూన్ 2 నుండి 22వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. అమరుల ఆశయాలకనుగుణంగా తెలంగాణను తీసుకురావడం జరిగిందని, ఈ 9 సంవత్సరాలలో తెలంగాణ వివిధ అంశాలలో దేశానికే ఆదర్శంగా నిలబడి జాతీయ స్థాయిలో సింహభాగాన్ని ఆక్రమించిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికి తెలియజెప్పేలా ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. గ్రామీణ ప్రజలతోపాటు, పట్టణాల్లోని వారు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ విషయమై మహబూబ్ నగర్,నారాయణపేట జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులతో సోమవారం మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. గతంలో పాలమూరు కూలీలు అంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి అని, అలాంటిది ఈరోజు అన్ని రాష్ట్రాల నుండి మహబూబ్‌నగర్‌కు వలస వస్తున్నారని, 9 ఏళ్లలో అన్ని రంగాలలో జిల్లా ఎంతో ప్రగతిని సాధించడం జరిగిందని,ఉపాధితోపాటు, ఉద్యోగం, వ్యవసాయం, వైద్యం కలెక్టరేట్ల నిర్మాణం ఎన్నో చేపట్టడం జరిగిందని, గతంలో కలెక్టర్లు,పరిపాలన అంటే తెలిసేది కాదని, ఇప్పుడు కేవలం అరగంటలో జిల్లా కలెక్టర్లను కలిసే అవకాశం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్పించాలని అన్నారు. 2014కు పూర్వం తెలంగాణ, 2014 తర్వాత తెలంగాణను కళ్లకు కట్టినట్లుగా ప్రజలందరికి తెలియజేసే బాధ్యత ప్రజా ప్రతినిధులతో పాటు, అధికారులందరిపై ఉందని ఆయన అన్నారు. ఉత్సవాలలో భాగంగా రోజువారి నిర్వహించే కార్యక్రమాలపై మంత్రి పలు సూచనలు చేస్తూ ఉత్సవాలను అధికారులు తమదిగా తీసుకుని నిర్వహించాలని, అందరు హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని, బాగా పనిచేసిన అధికారులను, ప్రజా ప్రతినిధులను సన్మానిస్తామని, అన్ని కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, సంబంధిత ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల సమ్మతితో కార్యక్రమాలను నిర్వహించాలని అన్ని శాఖలు గత తొమ్మిది సంవత్సరాలలో సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో తయారు చేయాలని, ఈ సమాచారం మొత్తం జూన్ రెండులోపు ప్రజాప్రతినిధులందరికి సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ రైతు దినోత్సవం మొదలుకొని జూన్ 22న నిర్వహించే అన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని, తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా కవులను, కళాకారులను సత్కరించాలని, తెలంగాణ గిరిజన ఉత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజనులను పిలిచి సేవాలాల్ మహారాజ్, దేవాలయం మండపం గురించి తెలియజేయాలని, తెలంగాణ మంచి నీళ్ల పండగ సందర్భంగా అన్ని వాటరన ట్యాంకుల వద్ద గతంలో నీటికోసం మహిళలు పడిన ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై నాడు, నేడు ఫొటోలతో సహా తెలియజేసే ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాల్సిందిగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు, ఆదేశాలను వివరించారు. జూన్ 2న ఉదయం 9 గం.లకు సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని, అంతకు ముందు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారని తెలిపారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సాధించిన విషయాన్ని ప్రజలందరికి తెలిసేలా చెప్పాల్సి ఉందని, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఇందుకుగాను అధికారులందరూ పూర్తిగా సహకరించాలన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇన్ని రోజులు చేసిన పనిని గొప్పగా చెప్పుకునేందుకు ఇది చక్కటి అవకాశంగా మార్చుకోవాలని, అలాగే ఈ ఉత్సవాలు ప్రజా ప్రతినిధులకు కూడా మంచి అవకాశం అని అన్నారు. కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏండ్ల అభివృద్ధిని తెలియజేసే విధంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో అన్ని గ్రామాలు,పట్టణాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇద్దరు కలిసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను సైతం భాగస్వామ్యం చేయాలని, వీలైనంత ఎక్కువ మంది ప్రజా ప్రతినిధులు భాగస్వాములు అయితే కార్యక్రమం విజయవంతం అవుతుందని అన్నారు. సమావేశంలో నారాయణపేట జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ వనజ, గిరిజన కార్పోరేషన్ ఛైర్మన్ వాల్యానాయక్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, డిసిసిబి ఇంచార్జి ఛైర్మన్ కె. వెంకటయ్య, ముడాఛైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు కెసి నర్సింహులు, బస్వరాజ్, లక్ష్మి, ఎస్పీ కె. నరసింహ, అడిషనల్ కలెక్టర్లు సీతారామారావు, మయాంక్ మిట్టల్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం,రాజేందర్‌రెడ్డి

## సొమ్ము కేంద్రానికి సోకు రాష్ట్రానిది..

**బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ**

**ధరూర్,మే 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉప్పేరు, గార్లపాడు, ఖమ్మంపాడు, వామన్‌పల్లి, చింతరేవుల, నర్సందొడ్డి, రేవులపల్లి, ఎమోలోనిపల్లి గ్రామాల్లో నాలుగోరోజు బిజెపి జెండాను బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి డికె అరుణ మాట్లాడుతూ అభివృద్ధికోసం కేంద్రంఇస్తున్న నిధులను కెసిఆర్ దోచుకుంటున్నాడని ఆరోపించారు. సొమ్ముకేంద్రానికి సోకురాష్ట్రానికి అన్నట్లుగా పరిస్థితి తయారైందని అన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే బిఆర్ఎస్ నాయకులు అవన్ని వారి ఖాతాల్లో వేసుకుంటున్నారు.గర్భిణీల కోసం రూ. 6వేలు అందిస్తుండగా,రాష్ట్రప్రభుత్వం మరో 6వేలు జోడించి మొత్తంగా రూ.12వేలు తామే పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని అన్నారు.10కోట్ల మంది పేద మహిళలకు ఉచితగ్యాస్ కనెక్షన్‌లకు శ్రీకారం చుట్టి మూడొంతులకు పైగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతు రాజంటూ పదే పదే చెప్పుకున్న ముఖ్యమంత్రి కెసిఆర్ వారి అభివృద్ధి కోసం మద్దతు ధర కూడా అమల్లోకి తేలేదని మండిపడ్డారు. గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు.



మాట్లాడుతున్న డికె అరుణ

## అర్హుల ఎంపికే లక్ష్యంగా పర్యటనలు..!

**నిత్యం వార్డుల్లో సందర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**
**గడప గడపకు వెళ్లి వివరాలు సేకరణ**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నిమ్మబాయిగడ్డ ప్రాంతం 18వ వార్డు, 19వ వార్డులో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇంటింటికి తిరుగుతూ లబ్దిదారులను గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలనే ఉద్దేశ్యంతో తానే స్వయంగా ఇంటింటికి తిరుగుతూ అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు.



జడ్చర్ల వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**అక్షర కాన్సెప్ట్ స్కూల్ సందర్శన...స్కూల్ బస్సు దహనంపై ఆరా..**

జడ్చర్ల మున్సిపాలిటీ కేంద్రంలోని పద్మావతి కాలనీలో అక్షర కాన్సెప్ట్ స్కూల్‌ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సందర్శించారు. ఇటీవల గుర్తు తెలియని దుండగులు స్కూల్ బస్సును దహనం చేయడంపై ఆరా తీశారు. పూర్తిగా కాలిపోయిన బస్సును పరిశీలించారు. ఒక మహిళ పాఠశాలను నడుపుతుండగా ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి శిక్షపడేలా చూస్తామని తెలిపారు. పాఠశాల నిర్వాహకులకు ధైర్యం చెప్పారు.

**ఆలూరు గ్రామంలో పర్యటన...**

తెలంగాణవచ్చాకే పల్లెలు అభివృద్ధి చెందాయని, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగైందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. రూ. 28 లక్షలతో అత్యాధునికంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలను అదేవిధంగా నూతనంగా నిర్మించిన రైతు వేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ – మిగతా3లో..

## తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

**- జూన్ 2 ఉదయం 9 గంటలకు జెండా ఎగరవేసి వేడుకలను ప్రారంభించాలి - కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతకుమారి**

**వనపర్తి ప్రతినిధి,మే29,ప్రభాతవార్త:** జూన్ 2వ తేదీ నుండి 21వరోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉత్సవాల ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ... జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని రైతు వేదికలకు మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలంకరణతో అందంగా అలంకరించి సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 3వ తేదీన తెలంగాణ రైతు దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీన సురక్ష దినోత్సవంలో భాగంగా ర్యాలీ, బ్లడ్ డొనేషన్ క్యాంపు, షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ధి ఉత్సవాలకు ప్రతి రోజు ఒక శాఖ తరపున ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 3వ తేదీన రైతు దినోత్సవం, 8వ తేదీన ఊరూరా చెరువుల పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తు విజయవంతం చేయడానికి మండల స్థాయి నోడల్ అధికారులు, కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దశాబ్ధి ఉత్సవాలలో ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జూన్ 12వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్, 13వ తేదీన వమిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తు మహిళలు, మహిళా అధికారులతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్తమ మహిళా ఉద్యోగులను సన్మానించడం జరుగుతుందన్నారు. తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం రోజున అన్ని గ్రామ పంచాయతీల్లో ఉదయాన్నే ర్యాలీలు నిర్వహించి, జెండాలు ఎగరవేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలలో వచ్చిన మార్పును వివరిస్తు పూర్వపు గ్రామ పంచాయతీలు , ప్రస్తుతం సాధించిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 58 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయని, 133 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని ఆయన వివరించారు. జూన్ 2వ తేదీ నుండి జూన్ 22వ తేదీ వరకు 21 రోజుల పాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నుండి అమరుల సంస్మరణ దినోత్సవం వరకు ప్రజలు ప్రజాప్రతినిధులను, అధికారులు మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేస్తు జిల్లాలో దశాబ్ధి ఉత్సవాలను విజయవంతం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతస్థాయి అధికారులు, వనపర్తి నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, ఆర్డీఈవో పద్మావతి, డీఆర్‌డీవో నరసింహులు, డీపీవో సురేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులు

## ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తా...

### ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**కల్వకుర్తి, మే 29 ప్రభాతవార్త:** ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని, ఫౌండేషన్ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గ రూపు రేఖలు మారుస్తానని, అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశమిచ్చి గెలిపిస్తే మరింత సేవ చేసుకునే అవకాశం కలుగుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు. గ్రామంలోని పలు దేవాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించి దేవాలయాలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్ట శ్రీనివాస్‌గౌడ్, సాంబ శివుడు, ఏజాస్, పాషా, కృష్ణారెడ్డి, గంగాధర్, శేకరయ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, జంగయ్యగౌడ్, గోపాల్, బొందయ్య, వెంకటేష్, నాయకులు అనిల్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



### జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన

## కరాటే కిరణ్‌నాయక్‌కు ఘన సన్మానం...

**కల్వకుర్తి, మే 29 ప్రభాతవార్త:** జమ్ము కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో పోలో గ్రౌండ్ ఇండోర్ స్టేడియంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కున్ బోకాటర్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌కు 85 కిలోల ఫైట్ విభాగానికి ఊర్కొండ మండలానికి చెందిన కిరణ్‌నాయక్ ఎంపికయ్యారు. జమ్ము కాశ్మీర్‌లో పాల్గొంటున్న కిరణ్ నాయక్‌ను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అభినందించి శాలువాలతో సన్మానించి ఆర్థిక సహాయం అందించారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంతో పాటు మన ప్రాంతానికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## కవి, గాయకులకు ఘన సన్మానం

**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** ఈనెల 27, 28వ తేదీలలో జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ సాహితీ మహోత్సవాలు – 2023 విజయవంతంగా ముగిశాయి. ఈసందర్భంగా పాటకు పట్టాభిషేకం, కవికి పట్టాభిషేకం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సాహితీ, ప్రజా నాట్యమండలి, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారులు సంఘం సంయుక్తంగా నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 100 మంది గాయకు లు, 80 మంది కవులు విచ్చేసి తమ పాటలు కవిత్వాన్ని వినిపించి అలరింపజేశారు. పాట పాలకప క్షం కాదని, ప్రజల పక్షాన ఉండాలని, సామాజిక కర్తవ్యాన్ని విశ్లేషణ చేసి కార్యక్రమానికి విచ్చేసిన పలువురు గాయకులకు, కవులకు దిశా నిర్దేశం చేశారు. వనపర్తి జిల్లా చరిత్రలో ఈ కార్యక్రమం నిలి చిపోతుందని పలువురు కొనియాడారు. పాల్గొన్న నాయకులు కవులకు ముఖ్య అతిథులచే శాలువా, మెమోంటో, ప్రశంసపత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు డి.కృష్ణయ్య, గౌరవ అధ్యక్షుడు గంధం నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజారాం ప్రకాష్, ప్రచార కార్యదర్శి చీర్ల నాగేంద్రం సాగర్, కార్యదర్శులు కాకం ఆంజనేయులు, భూరోజు గిరిరాజాచారి తదితరులు పాల్గొన్నారు.



## రైల్వేగేటు ఎప్పటిలేగా తెరిచే ఉంచాలని వినతి

**దేవరకద్ర,మే 29 ప్రభాతవార్త:** దేవరకద్ర రైల్వేగేటును ఎప్పటిలేగా అలాగే తెరిచేఉంచాలని భారత రైల్వేశాఖ మంత్రి అశ్విని వైభవకు యంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల దేవరకద్రలో ఆర్ఓబిని ప్రారంభించడంతో గతంలో ఉన్న దేవరకద్ర రైల్వేగేటును సంబందిత అధికారులు మూసిఉంచారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు అందోళన కూడ చేశారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని యంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సమస్య పరిష్కారానికి యంపీకి వినతి పత్రం అందజేశారు. అలాగే ఇంకా పలు సమస్యలను పరిష్కరించాలని కూడ మంత్రిని యంపి కోరారు. దీంతో సమస్యల పరిష్కారానికి భారత రైల్వేశాఖ మంత్రి అశ్విని వైభవ సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకొంటామని హామి ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.



## ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు త్వరగా పరిష్కరించాలని ఓఎ శ్రీనివాసులు అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు ఫిర్యాదులను స్వీకరించారు. సుమారు 15 మంది ఫిర్యాదు దారులు వారి ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి వారం ప్రజావాణికి అంద రు జిల్లా అధికారులు మాత్రమే హాజరు కావాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమ స్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వారం లోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని హరిజనవాడ గాంధీనగర్‌లలో క్రరెమ్మగుడి నుండి బొడ్రాయి వరకు 59 లక్షల ముఖ్యమంత్రి స్పెషల్ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తుండడంతో బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో వనపర్తి పట్టణాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దుతున్న తరుణంలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇలాంటి నాయకుడు ఉండడం వనపర్తికి ఎంతో గర్వకారణమని ఈ పనులు నాణ్యవంతంగా నిర్మించాలని కాంట్రాక్టర్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గొర్రెల కాపరుల సంఘం ఉపాధ్యక్షులు చంద్రయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంధం పరంజ్యోతి, కౌన్సిలర్ భర్త సూగూరు కృష్ణ (ఎల్ఐసి) మార్కెట్ డైరెక్టర్ లతీఫ్, గొర్ల రాంచంద్రయ్య, గంధం బుచ్చన్న , వార్డు ప్రజలు ఉన్నారు.



# గద్వాల సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా డీఎస్పీ

**గద్వాల ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా డీఎస్పీ ఎన్‌సిహెచ్ రంగస్వామి పట్టణంలోని సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి సర్కిల్ కార్యాలయ రికార్డులను, పరిసరాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసుల వివరాలను, సర్కిల్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ నిర్వహణ ఎలా అమలవుతుంది, గత సంవత్సరంలో సర్కిల్ పరిధిలో ఏఏ పోలీస్ స్టేషన్‌లో ఎన్ని కేసులు నమోదయ్యాయని, ఎన్ని కేసులలో నిందితులకు శిక్షలు పడ్డాయని, సర్కిల్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, ఏఏ ప్రాంతాలలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల నమోదు వివరాలు, నేరస్తుల ప్రస్తుత పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయి తదితర వివరాలు సిఐ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాలయంలోని 5ఎస్ అమలు తీరును, గ్రేవ్ కేసులకు సంబంధించి సీసీటీన్స్ ప్రాజెక్టు ఆన్‌లైన్‌లో పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో ఎంట్రీ చేసిన డాటాను, పిటిషన్ ఫైల్‌లో ఉన్న ఎంక్వైరీ రిపోర్టును పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్ కేసుల సిడి ఫైల్స్‌ను, క్రైమ్ మెమోస్, క్రైమ్ డైసెస్ట్ రికార్డులను, పిటి కేసు ఫైల్స్‌ను,యుఐ కేసుల ఫైల్స్‌ను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ప్రతి సిడి ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, గ్రేవ్ కేసులలో యుఐని తగ్గించాలని సిఐని ఆదేశించారు. గ్రేవ్ కేసుల విషయంలో సిసిటిఎన్ఎస్ ప్రాజెక్టులో నమోదు చేస్తున్నఎఫ్ఐఆర్,సిడిఆర్,పార్ట్‌వన్,పార్ట్‌టు,డిమాండ్‌డైరీ,చార్జిషీట్, ఇంటరాగేషన్‌రిపోర్ట్సును ఆన్‌లైన్‌లో ఎంట్రీఅవుతున్న తీరును పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని అన్నిపోలీస్‌స్టేషన్‌లలో డయల్ 100 కాల్ రాగానే వెంటనే ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునిసమస్యను పరిష్కరించేటట్లు చూడాలని, అలాగే బ్లూకోల్ట్స్, పెట్రోల్‌కార్ నిరంతరం 24/7 గస్తీనిర్వహించేటట్లు ఆయా ఎస్సైల ద్వారా చర్యలు చేపట్టాలని సిఐకి సూచించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లను తనిఖీచేయాలని,సిబ్బంది పని తీరును,5ఎస్ అమలుతీరు,ఫంక్షనల్ వర్టికల్ నిర్వహణను పర్యవేక్షించాలని,సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో నమోదవుతున్న,అయిన కేసులపై రివ్యూ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సిసి కెమెరాల స్థాపనకు ప్రజలను ప్రోత్సహించాలని,ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని డీఎస్పీ సూచించారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ చంద్రశేఖర్, గద్వాల రూరల్, ధరూర్,గట్టు ఎస్సైలు ఆనంద్,శేఖర్‌రెడ్డి,పవన్‌కుమార్, గద్వాల టౌన్ ఎస్సై 2 షుకుర్,ట్రాఫిక్ ఎస్సై విజయ్‌భాస్కర్, సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

### మతి మరుపు మాజీ మంత్రి రాజకీయాల నుండి

## తప్పుకుని బీసీలకు అవకాశం ఇవ్వండి

- మీరున్నప్పుడు రోడ్డు వెడల్పు 100 ఫీట్లకు తీర్మానం చేసి ఇప్పుడు అడ్డుకోవడం సరికాదు
- రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం మార్చినప్పుడు మీ తుపాకీ తుప్పు పట్టిందా.. - అఖిలపక్షం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** మతి మరుపు మాజీ మంత్రి రాజకీయాల నుండి తప్పుకుని బీసీలకు అవకాశం ఇవ్వాలని, మీరున్నప్పుడు రోడ్డు వెడల్పు 100 ఫీట్లకు తీర్మానం చేసి ఇప్పుడు అడ్డుకోవడం సరికాదని, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం మార్చినప్పుడు మీ తుపాకీ తుప్పు పట్టిందా.. అని అచలపక్షం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ మాజీ మంత్రి చిన్నారెడ్డిపై ధ్వజమెత్తారు. నాలుగు సంవత్సరాలుగా వనపర్తిలో సమస్యలు పట్టించుకోని మీరు, ఇప్పుడు ఎలక్షన్ల ముందు ఈ నీతిమాలిన రాజకీయాలు ఎందుకు చేయాలని చెప్పండి ఆయన ప్రశ్నించారు. సొంత పార్టీ కార్యకర్తలు , నాయకులు మిమ్మల్ని వద్దంటున్నా ఇంకా ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని ఆయన అన్నారు. వయసు పైబడి మీరు చేస్తున్న తెలివిలేని కార్యక్రమాల వల్ల కాంగ్రెస్ పార్టీ పరువు పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా వనపర్తి ప్రజల ఆశ, ఆకాంక్ష రోడ్డు వెడల్పు అని, దానిని అడ్డుకోవడం మీ మూర్ఖత్వమని ఆయన వెల్లడించారు. పేద ప్రజల ఇల్లు పోయినప్పుడు లేని మీ పోరాటం ఒక దర్గా విషయంలో అవస రమా అని ఆయన పేర్కొన్నారు. మీరు చేసిన పని వల్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారని , కాంగ్రెస్ పార్టీ చేసిన సర్వేల లో మీరు ఐదో స్థానంలో ఉన్నారని, మీరు తప్పుకోండని బీసీలుగా మాకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జానంపేట రాములు, బొడ్డుపల్లి సతీష్, నాయకులు శ్రీనివాసులు, హరీష్, సురేందర్, రాములు, వెంకటేష్, లక్ష్మయ్య, రోడ్డు వెడల్పు బాధితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్

## రెండవరోజు కొనసాగిన షాపింగ్ కాంప్లెక్స్ లబ్ధిదారుల నిరసనదీక్ష

**దేవరకద్ర,మే 29 ప్రభాతవార్త:** దేవరకద్రలో స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ లబ్దిదారులు చేస్తున్న నిరసనదీక్ష రెండవరోజు సోమవారం కూడ కొనసాగింది. ఈ నిరసనదీక్షలను లబ్దిదారులు ఈనెల 28న ప్రారంభించారు. అయితే ఈ సమస్యను ఎవరు పట్టించుకోకపోవడంతో వారు మళ్ళీ నిరసనదీక్ష చేపట్టిన విషయం విధితమే. లబ్దిదారులు చేపడుతున్న ఈ దీక్షకు బిజేపి సంఘీభావం తెలిపింది. ఈ సందర్బంగా దీక్షనుద్దేశించి బిజేపి మండల అధ్యక్షుడు కొండ అంజన్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు. 2019లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోనున్న శ్రీ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానానికి సంబందించిన స్థలంలో 54 షాపులు నిర్మిస్తామని 54కుటుంబాల వారితో ఒక్కొక్కరితో దాదాపు రూ.4లక్షల చొప్పున డిడిలు తీసుకున్నారన్నారు. అయితే ఇంతవరకు దాదాపు 4 ఏళ్ళు గడుస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. దీని గురించి ఎవరు కూడ పట్టించుకోవడంలేదని అంజన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, సంబందిత అధికారులు పట్టించుకొని వెంటనే మా సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా లబ్దిదారులు పెద్దఎత్తున నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులతో పాటు దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ లబ్దిదారులు,తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో నిరసనదీక్ష చేస్తున్న లబ్దిదారులతో బిజేపి నేతలు

## అర్ధరాత్రి వివోఏల అరెస్టులు

**మద్దూరు,మే 29 ప్రభాతవార్త :** రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఏప్రిల్ 17 నుండి మద్దూరు మండల కేంద్రంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తూ 43వ రోజు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఇంది రాపార్కు మహాధర్నా సందర్బంగా రాత్రి 12 గం.ల నుండి పోలీసులు అక్రమ అరెస్టు చేసి మద్దూరు పోలీస్ స్టేషన్‌లో మహాధర్నాకు వెళ్లకుండా నిర్బందించడం జరిగింది. ఇలాంటి నిర్బంధాలకు అరెస్టులకు భయపడకుండా రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా మద్దూరు పోలీస్ స్టేషన్‌లోని ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నా సందర్బంగా దర్పల్లి శ్రీనివాస్ వివోఎల సిఐటీయు అనుబంధ సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వివోఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని 10 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డ్రెస్‌కోడ్ ఇవ్వాలని అర్హులైనటువంటి వాళ్లను సిసిలుగా గుర్తించాలని డబుల్ బెడ్ రూంలు మహిళలకు పావలా వడ్డీలు, అభయహస్తం డబ్బులు తదితర డిమాండ్లపై మాట్లాడారు. అశోక్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, మండల కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, మండల కోశాధికారి పురుషోత్తం, గోవిందు, చోటమియా, రఫీ, శంకరయ్య, బీమ్లు, ఎల్లప్ప, నరహరి, కమలనాయక్, కిషన్‌నాయక్, సురేష్, కనకప్ప, భాస్కర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.



వివోఎలను అరెస్టు చేసిన పోలీసులు

## ఇన్సూరెన్స్‌పై కార్మికులకు అవగాహన..

### పిఎఫ్ జిల్లా నోడల్ అధికారి రమేష్ చావా

**చిన్నచింతకుంట,మే 29 ప్రభాతవార్త :** ప్రావిడెంట్ ఫండ్ ద్వారా ఇన్సూరెన్స్ పొందే విధానాన్ని బీడీ కార్మికులకు అవగాహన కల్పించడం జరిగిందని పిఎఫ్ జిల్లా నోడల్ అధికారి రమేష్ చావా తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పిఎఫ్‌లో తప్పులు దొర్లడం వల్ల భీమా, పెన్షన్ పొందలేకపోతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ కార్యాలయంలో క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రావిడెంట్ ఫండలో పేరు, పుట్టిన తేదీ సవరణలు, పిఎఫ్‌కు ఆధార్‌లింకు చేసుకోవడంపై కార్మికుల నుండి పత్రాలను తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పిఎఫ్‌లో తప్పులకు సంబంధించిన పత్రాలను ప్రావిడెంట్ ఫండ్ అధికారులు, కార్మికులు అందజేశారు. వెంటనే పీఎఫ్‌లో తప్పులు సరిచేసి పీఎఫ్ ద్వారా ప్రయోజనాలను పొంది అవకాశాలను కల్పించాలని బీడీ కార్మికులు కోరారు. అంతకు ముందు భవిష్యనిధి ద్వారా పొందే లాభాలను బీడీ కార్మికులకు పీఎఫ్ అధికారులు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ సెక్యూరిటీ సహాయ అధికారులు షేక్ నజీర్, మోటారాజ్, కార్మిక సంఘాల నాయకులు దేవదానం, యాదగిరి, కొండన్న వీరితో పాటు ఆయా గ్రామాల బీడీ కార్మికులు పాల్గొన్నారు.




ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ముస్లిం యువతి వివాహానికి అభిమన్యురెడ్డి ఆర్థిక సహాయం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అబ్దుల్లా కూతురు నాజిరిన్‌బేగం వివాహానికి బిఆర్ఎస్ యువనేత, ఎంపిటిసి అభిమన్యురెడ్డి రూ.10 వేలు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం అభిమన్యు యువసేన సభ్యులు రూ. 10 వేల నగదును అమ్మాయి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్సింహులు, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రాచమల్ల యాదగిరి, అభిమన్యు యువసేన మండల ఉపాధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, విజయ్‌కుమార్, నాజీమ్‌బేగ్, రమేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,మే 29 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 46 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్‌సోన ధాన్యానికి అత్యధికంగా రూ. 2059ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.1501ధర పలికింది. అలాగే 34 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1529 ధర పలికింది. అలాగే అతితక్కువగా రూ.1449 ధర పలికింది.

## మాజీ కౌన్సిలర్ జిజె శ్రీను తండ్రి మృతికి సంతాపం



**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** మాజీ కౌన్సిలర్ జిజె శ్రీను తండ్రి జమ్మిచెడ్ బాలయ్య మృతి చెందడంతో పలువురు నాయకులు ఆయన పార్థివ దేహంపై పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మాజీ వైస్ చైర్మన్ తైలం శంకర్ ప్రసాద్, కౌన్సిలర్ కాగితాల లక్ష్మీ నారాయణ, కో ఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్, బీఆర్ఎస్ నాయకులు ఎర్ర శ్రీను, ఉంగ్లం తిరుమల్ తదితరులు ఉన్నారు.

## దాబాను ప్రారంభించిన ప్రశాంత్‌రెడ్డి



**దేవరకద్ర,మే 29 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్ స్టేజి సమీపంలో ఏర్పాటు చేసిన దాబాను సోమవారం ఏర్పాటు చేసిన దాబాను టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. పెద్దరాజమూర్‌కు చెందిన వీకేర్ ట్రస్ట్ విజయకుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఈ దాబా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి దాబాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాబా నిర్వహకులతో పాటు నాయకులు కొండ వీరారెడ్డి,పరమటి మహేష్, కేపీఆర్ యూత్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా పనులు ప్రారంభించండి

**అమరచింత,మే29,ప్రభాతవార్త:** అమరచింత మున్సిపాలిటీలో నూతన ఈద్గా పనులు వెంటనే ప్రారంభించాలని ఏఐవోఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ అన్నారు. ఈద్గా నిర్మాణం కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రంజాన్ పండుగ రోజు భూమిపూజ చేశారని తెలిపారు. నేటికీ ఈద్గా పనులు ప్రారంభం కాలేదని కుతుబ్ ఆరోపించారు. సోమవారం ఆయన ముస్లీం మైనార్టీ యువకులతో కలిసి ఈద్గా వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఈద్గా నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఐదు లక్షల నిధులు మంజూరు చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఇది ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకువెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లీం యూత్ నాయకులు టిప్పు ఫయాజ్, ఖదీర్ పాల్గొన్నారు.

## కవి బూరోజు గిరిరాజాచారికి ఘన సన్మానం

**వనపర్తి టౌన్ ,మే29,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన పాటకు పట్టాభిషేకం కార్యక్ర మంలో భాగంగా ఈనెల 28వ తేదీన జరిగిన తెలంగాణ చైతన్య సాహిత్య కవి సమ్మేళనంలో తెలంగాణ తెచ్చింది పాట, తెలంగాణ చైతన్య గీతిక కవిత అనే కవిత వినిపించిన కవి పండితుని నిర్వహణ కార్యదర్శి బూరోజు గిరిరాజాచారిని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి చేతుల మీదుగా ఘన సన్మానం నిర్వహించారు. ప్రజా వైద్యశాల అధినేత డాక్టరన మురళీధర్ , నిర్వహణ కమిటీ గౌరవఅధ్యక్షుడు గంధం నాగ రాజు, అధ్యక్షులు కృష్ణయ్య,ప్రధానకార్యదర్శి రాజారాం ప్రకాష్, ప్రచార కార్యదర్శి చీర్ల నాగేంద్రం సాగర్, కార్యదర్శి కాకం ఆంజనేయులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం..



**గండీడ్,మే29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దవార్వాల్ గ్రామంలో వైఎస్ఆర్టిపి ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దవార్వాల్ ప్రీమియర్ లీగ్ 7 క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్ఆర్‌టిపి పరిగి ఇంఛార్జి ఎండి గౌస్‌పాషా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. నరసింహారావు సోమవారం ప్రారంభించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడా రంగంలో మంచి నైపుణ్యత పొంది క్రీడారంగంలో కూడా రాణించాలని క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవలని సూచించారు. ఈసందర్బంగా వారు క్రికెట్ ఆడి సందడి చేశారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పిపిఎల్ ఇంఛార్జి వెంకటేష్‌గౌడ్, పిపిఎల్ అధ్యక్షులు ప్రశాంత్,వీరన్న,యాదిలాల్, ఎస్ఎంసి ఛైర్మన్ కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను, మొగులయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

## దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం...

**వెల్దండ, మే 29 ప్రభాతవార్త:** దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహద పడుతాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని అజిలాపూర్ గ్రామంలో బొడ్రాయి పత్రిష్ట పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కాలే లక్ష్మమ్మ వెంకటేష్, ఎంపీటీసీ లక్ష్మమ్మ మల్లేష్‌లు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ



మార్గాన్ని అనుసరించి కుటుంబంలో, సమాజంలో సుఖ సంతోషాలు విరజిల్లుతాయని, అధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరు దైవ్య చింతన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వాస తిరుపతయ్య, వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, రవిగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## దేవాలయాలాభివృద్ధికి సహకరిస్తా...

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**

దేవాలయాలాభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో కోట మైసమ్మ దేవాలయ నిర్మాణానికి సర్పంచ్ చెర్క రేవతి రాజశేఖర్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్యలతో కలిసి కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.



దేవాలయ నిర్మాణాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా అజిలాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పున: ప్రతిష్ట పూజా కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. దైవ కార్యక్రమాల ద్వారా సుఖ సంతోషాలు విరజిల్లుతాయన్నారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## అభాగ్యులకు అండ... సీఎం రిలీఫ్ ఫండ్..

**-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై వైద్యం చేయించుకోలేని నిస్సాహాయ స్థితిలో ఉండి ప్రాణాలు కోల్పోతున్న వారిని బ్రతికించాలనే ఆలోచనలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశ పెట్టి అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తాడూర్ మండలంలోని చర్ల



తిర్మలాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు మంజూరైన రూ.52,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితురాలికి ఎమ్మెల్యే అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్ర మంలో నియోజకవర్గ నాయకులు తదితరులు ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**అభివృద్ధి పేరుతో హంగామా చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి**

**బీఎస్పీ నారాయణపేట నియోజకవర్గ ఇంఛార్జి బొదిగెలి శ్రీనివాస్**

**నారాయణపేట ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జి బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో హంగామా చేస్తున్న ఎమ్మెల్యే రాజేందం రెడ్డి ఎంతమందికి పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేశారో సమాధానం చెప్పగలరా అని



ప్రశ్నించారు.ఎమ్మెల్యే అండతో నియోజకవర్గం ఇసుక,మట్టిమాఫియాకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. మరికల్ మండలం రాకొండ గ్రామంలో సొంత పార్టీ నాయకులు తవ్విన ఇసుక గుంతలో పడి ముగ్గురు పేద బిడ్డలు ప్రాణాలు కోల్పోతే కనీసం స్పందించిన పాపాన పోలేదన్నారు. ఇసుక మాఫియాను స్వయంగా ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరుగుతున్నదని ఆరోపించారు. అనంతరం మండల కమిటిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా దానపోళ్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కార్యదర్శిగా గోవింద్, కోశాధికారిగా రమేష్‌ను నియమించారు.

## సివిల్ ఫిర్యాదులు కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి

**డిసిఆర్‌బి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు**

**నారాయణపేట ప్రతినిధి,మే 29 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు నిర్వహించారు. సోమవారం మొత్తం జిల్లాలో 6 ఫిర్యాదులను బాధితుల నుండి స్వీకరించి వాటిని చట్ట ప్రకారం పరిశీలించవలసిందిగా పోలీసు అధికారులకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని డీఎస్పీ సూచించారు. బాధితులు తీసుకువచ్చే



ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్‌లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదులు అయినా పెండింగ్‌లో ఉంటే పెండింగ్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీస్ అధికారులు బాధితులకు ప్రత్యక్షంగా ఫోన్‌ద్వారా తెలిపి పిటిషన్‌కు సంబంధించి ఫీడ్‌బ్యాక్ తెలుపుతూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో పోలీసు వారి డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## అర్హుల ఎంపికే లక్ష్యంగా పర్యటనలు..!

**మొదటి పేజీ తరువాయి భాగం...**

స్వరాష్ట్రంలోనే మన పండగలకు, సంస్కృతికి గుర్తింపు లభించిందన్నారు. అదేవిధంగా మన ఊరు మన బడి పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పాఠశాలలను సకల హంగులతో తీర్చిదిద్దిన ట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాలోల జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, దొరెపల్లి లక్ష్మీరవిందర్, మార్కెట్ కమిటి ఛైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు



అక్షర స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జంగయ్య, ఎంఈఓ మంజులాదేవి, నాయకులు పాలాది రామ్మోహన్, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ పిట్టల రవిందర్, బాలు, సూరి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఆర్యవైశ్యుల సేవలు...

**- శ్రీ మల్లిఖార్జున అన్నసత్ర సంఘం అధ్యక్షులు మిడిదిడ్డి శ్యాంసుందర్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులతో పాటు సమాజంలోని ప్రజలకు ఆర్యవైశ్యులు ముక్తకంఠంతో సేవలను అందిస్తూ అభివృద్ధికి దోహద పడుతామని శ్రీ మల్లిఖార్జున అన్నదాన సత్ర సంఘం అధ్యక్షులు మిడిదిడ్డి శ్యాంసుందర్ పేర్కొన్నారు. సోమవారం జ్యోతిర్లింగాలలో ఒక్కటైన శ్రీశైల మల్లిఖార్జున స్వామి సన్నిధిలో ఆర్యవైశ్యులకు నిరంతర సేవలందించేందుకు నిర్మితమైన ఆర్యవైశ్య దివ్య సేవాధామం టీ.జి.లక్ష్మి వెంకటేష్ భవన్, శ్రీ మల్లిఖార్జున అన్నదానసత్రాన్ని అధ్యక్షులు మిడిదిడ్డి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి బలుస శ్రీరాములుతో పాటు డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఉదయం 8.35 గంటలకు మిధున లగ్నములో గోపూజ, మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాశన, రక్షాబంధనం, అఖండ దీపారాధన, ఆచార్య రిత్విక్ వరుణం (అగ్ని సూక్తంతో అగ్ని ఆవాహన), పాకశాల ప్రారంభోత్సవం, యాగశాల ప్రవేశం, ఆదిత్యాది నవగ్రహ ఆరాధన, శ్రీశైల క్షేత్ర పాలకులు శ్రీ వీరభద్రస్వామికి ఆరాధణ, అభిషేకం, అర్చన, మహానివేదన, మంగళహారతి, ఆశీర్వచన కార్యక్రమాలతో పాటు సాయంత్రం 6 గంటలకు పావన కృష్ణ నదికి వేదోక్త పూర్వక హారతి, 7 నుంచి 7.35 గంటల వరకు ప్రదోషకాల పూజ, వేదస్వస్తి, శ్రీ వినాయక వీరభద్ర స్వామి వైభవం చరిత్ర ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమాలను నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ సురేష్ శర్మ బృందం 161 మంది వేద పండితుల బృందంతో నిత్య పూజ, హోమ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు సమాజంలోని ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తూనే సామాజిక వర్గాల ప్రజలకు తమ సేవలను



ఆర్యవైశ్య దివ్య సేవాధామం టీ.జి.లక్ష్మి వెంకటేష్ భవన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అందించేందుకు విస్తృత స్థాయిలో కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందితేనే సమాజాభివృద్ధి చెందుతుందని భావించి ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తూ సమాజంలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. మొదటి రోజు ఎపీ దేవాదాయ శాఖ మాజీ మంత్రివర్యులు శ్రీ వెల్లంపల్లి శ్రీనివాసులు, ఎపీ కమిషనర్, రాష్ట్ర సమాచార హక్కు చట్టం శ్రీ రేపాల శ్రీనివాస్‌రావు పుణ్య దంపతులు, ఎపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ముక్కాల ద్వారాకానాథ్, వాసవీ సత్రాల సముదాయ అధ్యక్షులు శ్రీ దేవకీ వెంకటేశ్వర్లు, టి.టి.డి.



అతిథులను శాలువాలతో సన్మానించి మెమెంటోలను బహుకరిస్తున్న శ్రీ మల్లిఖార్జున అన్నదాన సత్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు, డైరెక్టర్లు

పాలక మండలి సభ్యులు శ్రీ టి.మారుతి ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హాజరైన అతిథులను అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలను బహుకరించారు. పట్టు పంచెలను అందించారు. రేపాల శ్రీనివాసరావు దంపతులకు పట్టువస్త్రాలను అందించారు. మొదటి రోజు వేడుకలు అంగరంగా వైభవంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రతినిత్యం భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి..

**- క్రీడలు స్నేహ బంధాన్ని పెంచుతాయి - ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త:** క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే నిజమైన క్రీడాకారులుగా రాణించగలుగుతారని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు స్నేహబంధాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. బిజినపల్లి మండల కేంద్రంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఓటమి గెలుపుకు నాంది అని, ప్రతి క్రీడాకారుడు ఓటమి చెందితే నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశాలు కలి సి వస్తాయని భావించి క్రీడాకారులతో స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. క్రీడల వల్ల ఎక్కడో ఉన్న వ్యక్తులతో పరిచ యాలు ఏర్పడి స్నేహబంధాలు ధృడంగా మారి ఎన్నో అవకాశాలు కలిసి వస్తాయని, వాటితో అభివృద్ధి చెందేందుకు కూడా ఉపయో గపడుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ క్రీడలను పెంపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ యువకులకు ప్రోత్సాహం కల్పించి క్రీడలను మరుగున పడకుండా అభివృద్ధి చేయాల్సి న బాధ్యత ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## గురుకుల పీఈటీ నియామకాలను వెంటనే చేపట్టాలి..

**- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



పీఈటీ నియామకాలు చేపట్టాలని కోరుతున్న రాచాల యుగంధర్ గౌడ్



మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి,మే29,ప్రభాతవార్త:** హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 2017 గురుకుల పీఈటీ నియామకాలను వెంటనే చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన అభ్యర్థులతో కలిసి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ... గురుకుల పీఈటీ నియామకాలను 2017 లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చి 2018లో ఫలితాలు విడుదల చేసిందని , అప్పటి నుండి కోర్టు కేసుల కారణంగా నియామకాలు చేపట్టడం లేదని చెబుతూ వచ్చిన ప్రభుత్వం కోర్టు తీర్పు ఇచ్చి 2 నెలలైనా ఉద్దేశ్యపూర్వకంగానే నియామకాలు చేపట్టకుండా పీఈటీ అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. ఐదేళ్లుగా ఫలితాలు వెల్లడించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఎనిమిది మంది పీఈటీ అభ్యర్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు అధ్యాపకులు, వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ప్రభుత్వం వీరి పట్ల వివక్ష చూపడం సమంజసం కాదని అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం గురుకులాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం పీఈటీ నియామకాలు చేపట్టకపోవడం చేత విద్యార్థుల్లో క్రమ శిక్షణతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. అభ్యర్థులకు రోజు రోజుకు కుటుంబ పోషణ భారం అవుతుందని ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకుని దశాబ్ది ఉత్సవాలలోపు ఫలితాలు ప్రకటించి నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పీఈటీ అభ్యర్థులు నరేందర్, సుందర్, నాగరాజు, చరణ్, విజయ్ నాయక్, యోగేష్, శైలజ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురలో బీజేపీ ప్రభుత్వ దాడులను ఖండించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

**- ప్రభుత్వం జోక్యం చేసుకుని హింసను తక్షణమే ఆపాలని డిమాండ్**

**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** త్రిపురలో బీజేపీ ప్రభుత్వ దాడులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. సోమవారం సీఐటీయు జిల్లా కార్యాలయంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశాన్ని మేకల ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ....త్రిపురలో ఎన్నికల అనంతరం బీజేపీ సాగిస్తున్న అటవిక హింసాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ హింసను తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ చేసిన దాడులలో ఇప్పటి వరకు 5 మంది మరణించడం జరిగిందని, 630 మంది గాయపడ్డారని,85 ఇండ్లు దగ్ధం కాగా 65 పాక్షికంగా దగ్ధమయ్యాయని, 96 దుకాణాలు దగ్ధమయ్యాయని, 1647 ఇళ్లను ధ్వంసం చేసి దోచుకున్నారని ఆయన తెలిపారు. ఈ





మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

హింసకు బాధ్యులైన వారందరినీ అరెస్టు చేసి, ప్రజల జీవితాలకు, వారి జీవనోపాధులకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని త్రిపుర చీఫ్ సెక్రటరీని పోలీస్ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ తరహా నిరంకుశవాదం, అప్రజాస్వామికవాదం, అమానవీయ ప్రవర్తనా శైలిని ఏ మాత్రం సహించలేమని అన్నారు. ఈ దారుణమైన హింసా కాండ బాధితులకు సంఘటిత రైతాంగం తరపున పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. అతి స్వల్ప మెజార్టీతో గెలుపొందడం పైగా తన ఓటు బ్యాంకు క్షీణించడం వంటి కారణాలు బీజేపీ నేతలను తీవ్ర నిరాశపరిచాయని , ఆ నిరాశ నిస్పృహలతోనే వారు ఈ ఆటవిక దాడులకు తెగబడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం రాజ్యాంగపరంగా సంక్రమించిన బాధ్యతలను నెరవేర్చి శాంతి భద్రతల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రంలో బీజేపీ పార్టీ పాసిజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ మేకల ఆంజనేయులు, బాల్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజు, రమేష్, రాజు, మహబూబ్ పాషా, వెంకటేష్, అజయ్, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలను విద్యుత్ ధీపాలతో అలంకరించాలి

**వీపనగండ్ల ,మే29,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని వీపనగండ్ల మండల అభివృద్ధి అధికారి కి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కథాలప్పకు వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి మురళి మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారం చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని అంబేద్కర్ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, విగ్రహాలకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షులు శరత్, అంబేద్కర్ యూత్ సభ్యులు మీసాల సహదేవుడు , పాము రాము పాల్గొన్నారు.

## నూతన కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే29 ప్రభాతవార్త:** జూన్ 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్న నాగర్‌కర్నూల్ నూతన సమీకృత కార్యాలయాల సముదాయములో తుది మెరుగులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు.



సోమవారం స్థానిక శాసనసభ్యులు మర్రి జనార్ధన్‌రెడ్డితో కలిసి నూతన సమీకృత కార్యాలయ సముదాయాన్ని పరిశీలించారు. కలెక్టర్ చాంబర్, స్టేట్ చాంబర్‌లో ఉన్న చిన్న చిన్న పనులు పూర్తి చేసి తుది మెరుగులు దిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్.టి. లైన్ కనెక్షన్ వెంటనే ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. ప్రారంభోత్సవ వేడుకలకు పూల మొక్కలతో అలంకరణ బాధ్యతలను కాంట్రాక్టర్‌కు అప్పగించారు.ఎక్కడ అలంకరణ లోటు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రెవెన్యూ మోతిలాల్, రోడ్ల భవనాల శాఖ ఈఈ భాస్కర్, డీ.ఈ.ఈలు, ఎస్ఈ నర్సింగం, కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**- కలెక్టరేట్ ఏవో రాజేందర్ గౌడ్ - ప్రజావాణికి 78 దరఖాస్తులు**

**వనపర్తి ప్రతినిధి,మే29,ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టరేట్ పాలనాధికారి ఎల్.రాజేందర్ గౌడ్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఐడిఓసి ప్రజావాణి సమావేశ



మందిరంలో ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తుదారుల నుండి వచ్చిన 78 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దరఖాస్తుదారుల నుండి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు జె.కె మోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి చిన్నారెడ్డికి ఉలికిపాటు ఎందుకో..?

**- దళిత అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రవి ప్రసాద్**

**వనపర్తి టౌన్,మే29,ప్రభాతవార్త:** ఈ నాలుగున్నర సంవత్సరాలలో ప్రజల గోడు పట్టని మాజీ మంత్రి చిన్నారెడ్డికి ఇప్పుడిప్పుడే వనపర్తి సమస్యలు గుర్తుకొస్తున్నాయా?,నాలుగున్నర సంవత్సరాలలో ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సమస్యలపై గొంతెత్తి విలపిస్తుంటే కన్నెత్తి చూడని మాజీ మంత్రికి ఎన్నికలప్పుడే



ఇవన్నీ గుర్తుకొస్తాయా? , మాజీ మంత్రి చిన్నారెడ్డికి ఇంత ఉలికి పాటు ఎందుకో అని దళిత అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రవి ప్రసాద్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్ధ రాత్రి ఎవరికి చెప్పా పెట్టకుండా ఎలాంటి లీగల్ యాక్షన్ లేకుండా, ఒక ఐడియాలజీ లేకుండా అధికార మదంతో రాత్రికి రాత్రే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించినప్పుడు లేని ఆవేదన, గాంధీ విగ్రహాన్ని మార్చినప్పుడు లేని ఆలోచన, తాళ్ల చెరువు దగ్గర దళిత బహుజన సమాధులను ప్రభుత్వ యంత్రాంగం నిర్దాక్షిణ్యంగా తొలగించినప్పుడు లేని స్పృహ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం గూర్చి ఇంత ఉలికిపాటు ఎందుకో అని ఆయన పేర్కొన్నారు. నాయకుడు అనే వాడు నిరంతరం ప్రజల మధ్యనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని, ప్రభుత్వాలను అధికారులను నిలదీయాలని, ఈ ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ అడ్రస్ గల్లంతు ఇది వీళ్ల ఓటు బ్యాంకు రాజకీయ నేపథ్యం అని,ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని ప్రజలు పిచ్చివాళ్లు కాదని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రకరకాల వేషగాళ్లు రకరకాల మాయమాటలతో ప్రజలను మభ్య పెట్టి , ప్రలోభాలకు గురి చేస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం మీ చేతుల్లోనే ఉందని అన్నారు.

## రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి..

**వరిధాన్యం బస్తాల మాయంపై జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫిర్యాదు**

**అయిజ,మే 29 ప్రభాతవార్త :** పట్టణంలోని అన్నపూర్ణ రైస్‌మిల్లులో దాదాపు 58300ల వరిధాన్యం బస్తాలు మాయమయ్యాయని సోమవారం తుపత్రాళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున్‌గౌడ్ జిల్లా పౌరసరఫరాల అధికారికి లిచత పూర్వక ఫిర్యాదు చేశారు. రైతుల నుండి తెలంగాణ ప్రభుత్వం ఒక్కో క్వింటాలు 1980 రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు చేయగా మిల్లుల యజమానులు స్వార్థపు ఆలోచనల కారణంగా అయిజలో మాయమైన వరిధాన్యం విలువ దాదాపు రూ. 4 కోట్లపై బడి ఉంటుందని ఇటువంటి విషయాలపై సమగ్రమైన దర్యాప్తు చేసి అవకతవకలకు పాల్పడ్డ వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



పౌరసరఫరాల అధికారికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

## ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



**వెల్దండ, మే 29 ప్రభాతవార్త:** సమాజంలో అందరు సమానంగా, అభివృద్ధి అకాంక్షలను తెలంగాణ రాష్ట్రం నేరవేరుస్తూ ప్రజలను కంటికిరెప్పలా కాపాడుకుంటున్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచ్ కాలే లక్ష్మమ్మ వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రా ష్ట్రం అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచిందని, దేశ ప్రజలందరు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని, సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధితో తెలంగాణ విశ్వనగరంగా అభివృద్ధి చెందేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు తప్ప ప్రతిపక్షాలు తట్టుకోలేకనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, ప్రతిపక్షాలు ఎన్ని మాటలు చెప్పిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సరైన సమయంలో ప్రతిపక్షాలకు ప్రజలు తగిన బుద్ది చెబుతారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొన్ని తెలంగాణరాష్ట్రానికి చెందాల్సిన నిధుల్లో కోతలు పెడుతూ అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. దేశం మొత్తం రైతురాజ్యం కావాలని ప్రజలందరు కోరుకుంటున్నారని తెలిపారు. రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోవు ఎన్నికల్లో 100 ఎమ్మెల్యేలను కైవసం చేసుకొని హ్యాట్రిక్ విజయాన్ని నమోదుచేస్తామని ధీమా వ్యక్తంచేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు వెంకటయ్యగౌడ్, మల్లేష్, కరుణా కర్‌రెడ్డితో పాటు ఉన్నారు.

## సమ్మెకు సిద్ధమవుతున్న పారిశుద్ధ్య కార్మికులు..

**- గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలి**

**- జీవో 60 ప్రకారం జీతాలు చెల్లించాలి**



**పెద్దమందడి ,మే29,ప్రభాతవార్త:** తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు మేరకు నిరసన తెలుపుతున్నట్లు మండల కమిటీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా పోరాటాలలో భాగంగా వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ అయినా కారోబార్క, బిల్ కలెక్టర్‌కు, స్వీపర్స్, ఎలక్ట్రిషియన్స్, వాటర్‌మెన్, డ్రైవర్స్ తదితరులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో అఫ్జల్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న సిబ్బంది మొత్తాన్ని పర్మినెంట్ చేస్తు మినిమమ్ బేసిక్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15వేలు, బిల్ కలెక్టర్‌కు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్స్‌కు రూ.22,750 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటును కేటాయించాలని ఈ గ్రాంటు నుండే వేతనాలు చెల్లించాలని కోరారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా జనాభా ప్రాతిపదికన పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, జీవో నెం.51ని సవరించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి గ్రామ పంచాయతీ అసిస్టెంట్‌గా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, చెన్నరాములు, ఇబ్రహీం, కృష్ణ, గట్టమ్మ, గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లింగాయత్ మహార్యాలీ విజయవంతం చేయాలి..

**గండీడ్, మే 29 ప్రభాతవార్త :** వచ్చేనెల 4వ తేదీన, ఛలో హైదరాబాద్ లింగాయత్ మహార్యాలీని జయప్రదం చేయాలని వీరశైవ లింగాయత్ లింగబలిజ ఉమ్మడి జిల్లా ఇంఛార్జి శివకుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు సిద్ధిలింగం తెలిపారు. సోమవారం గండీడ్ మండలంలోని వెన్నచెడ్ గ్రామంలో బసవేశ్వరుని విగ్రహం దగ్గర ఛలో లింగాయత్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవ లింగాయతులను వెంటనే కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చాలని



అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీరశైవ లింగాయత్‌ల సంక్షేమం కొరకు వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ. 10 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించి, అర్హులైన బీదవారికి 80 శాతం మార్జిన్ మనితో ఋణ సదుపాయం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న బిసి లింగాయతులకు 42 అసెంబ్లీ, 5 పార్లమెంట్ నియోజకవర్గాలలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న లింగాయత్‌లకు అన్ని రాజకీయ పార్టీలు ఎంఎల్ఎ, ఎంపి సీట్లలో పార్టీ టికెట్స్ నామినేటెడ్ పదవులను ప్రభుత్వం కేటాయించాలన్నారు. దేశ రాజధానిలో నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి అనుభవ మంటపంగా నామకరణం చేయుట, మహాత్మ బసవేశ్వరుని వచనాలను, జీవిత చరిత్రను కెజి నుండి పిజి వరకు అన్ని భాషలలో అన్ని రాష్ట్రాల పాఠ్యపుస్తకాలలో ప్రచురించుట బసవతత్వ ప్రచారంలో భాగంగా వివిధ తెలంగాణ విశ్వవిద్యాలయాలలో బసవతత్వ అధ్యయన కేంద్రాలు, వీటికి సంబంధించిన సాహిత్యమును అందుబాటులో ఉంచి, ఒక్కొక్క కేంద్రానికి రూ. 2 కోట్ల బడ్జెట్ కేటాయించాలని మహాత్మా బసవేశ్వరుని విగ్రహమును అసెంబ్లీ ఆవరణలో పెట్టాలని పల్లె పట్టణాలందు బసవ భవనానికి స్థలము సేకరించి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. అలాగే పాల్కురికి సోమనాథ మహాకవిని ఆదికవిగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించాలి. పై డిమాండ్లన్ని నెరవేర్చేందుకు హైదరాబాద్ నగరంలో లింగాయత్ మహార్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహార్యాలీని లింగాయత్‌లు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు వీరన్న, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వినోద్, రాష్ట్ర సభ్యులు మల్లికార్జున్, యూత్ అధ్యక్షులు శివప్రసాద్, మహిళా అధ్యక్షురాలు నాగశ్రీ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమం..

**వనపర్తి టౌన్, మే29, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలో 38వ రోజు హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఇంటింటికి ప్రచారం చేస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఆర్థిక సహాయం, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ, రూ. 500కే వంటింటి గ్యాస్ సిలిండర్, కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ వనపర్తిలో రోడ్ల విస్తరణలో నష్టపోయిన బాధితులందరికీ నష్టపరిహారం ఇప్పిస్తామని,



విద్యారంగంలో వనపర్తిని మహోన్నతగా నిలుపుతామని, వనపర్తి మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్ది, అవినీతి రహిత పాలన అందిస్తామని, అంతేకాకుండా చెత్తాసేకరణలో ప్రైవేటు ఏజెన్సీని రద్దు చేస్తామని, వనపర్తిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని, నిరుపేదల అభ్యున్నతి లక్ష్యంగా కాంగ్రెస్‌ను ఆదరిస్తేనే పోరాటాలతో తెచ్చుకున్న తెలంగాణ ఆకాంక్షలతో పాటుగా వనపర్తి ప్రజలు ఆశలు అందుకే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ వనపర్తి టౌన్ అధ్యక్షులు చీర్ల చందర్, పీసీసీ డెలిగేట్ కిరణ్ కుమార్, కోట్ల రవి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు నందిమల్ల యాదయ్య, కదిరె రాములు, మన్యంకొండ, మెంటపల్లి రాములు, కృష్ణబాబు, మన్యంపులి రాములు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎల్లన్న, దివాకర్, రోహిత్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పెంటన్న, దిలీప్, అబ్దుల్లా, వెంకటేష్, వెంకట్ నారాయ ణ, బాబా సమద్, కమర్ మియా, బాబా , కౌన్సిలర్ సుమిత్ర యాదగిరి , రమేష్ , గంధం లక్ష్మయ్య, సేవ దళ్ జానకిరాముడు, వెంకటేష్, శ్రీను, భాస్కర్, పెద్ద ఎంకటి, రాములు, సురేష్, శివకుమార్, బాలరాజు, నరసింహ, రవిసాగర్, కార్తీక్, నరేష్‌సాగర్, శివ, లక్ష్మయ్య, ఢిల్లీ సుల్తాన్ పాల్గొన్నారు.

## శుభకార్యానికి హాజరైన డిసిసి అధ్యక్షుడు

**దేవరకద్ర, మే 29 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ఏవిఎన్ గార్డెన్‌లో సోమవారం జరిగిన ఉమ్మడి దేవరకద్ర మండలం కౌకుంట్ల మండల కేంద్రం సర్పంచ్ స్వప్న కిషన్‌రావు పుత్రుడు, పుత్రిక పుట్టుపంచె శుభకార్యానికి డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులను ఆయన ఆశీర్వదించారు. అలాగే నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, అరవింద్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ కిషన్‌లతో పాటు జిల్లాలోని ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.



## రాష్ట్ర దశాబ్ది వేడుకల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, మే 29 ప్రభాతవార్త :** పండగ వాతావరణంలో వైభవోపేతంగా దశాబ్ది వేడుకల నిర్వహణ, రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండగ నిర్వహణకు ప్రత్యేక మానిటరింగ్ కమిటి, రాష్ట్ర దశాబ్ది వేడుకల నిర్వహణపై సీఎస్ నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండగ వాతావరణంలో వైభవోపేతంగా రాష్ట్ర దశాబ్ది వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌లతో విడియో సమావేశం ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ సృజన, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌లతో కలిసి విడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జూన్ 2 నుండి జూన్ 22 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలలో మన ప్రగతి చాటే విధంగా ఘనంగా నిర్వహించాలని అన్నారు. రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండగ నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. రైతు దినోత్సవం నాడు జిల్లాలో ఉన్న రైతు వేదికలో వేడుకలు జరగాలని, ప్రతి గ్రామం నుంచి రైతులను డప్పులతో ఘనంగా పండగ వాతవరణంలో రైతు వేదికలకు తీసుకుని రావాలని, అక్కడ ప్రభుత్వం ప్రతి రైతుకు కల్పించిన సౌకర్యాలు, అందించిన సహాయంపై తెలియజేయాలని, భోజన ఏర్పాట్లు ఉండాలని అన్నారు. జూన్ 8న ఊరూరా చెరువుల పండగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్దచెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ

పూజ, భోజనాలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండగ నిర్వహణకు జిల్లాలో అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, క్షేత్రాయిలో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రావద్దని సీఎస్ అన్నారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు, నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలని అన్నారు. పారిశ్రామిక ప్రగతి, సాగునీటి రంగంలో సాధించిన విజయాలు తెలియజేయాలని అన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్నచోట ఇంటి పట్టాల పంపిణీ, బిసి కుల వృత్తుల ఆర్థిక సహాయం ప్రారంభించాలని అన్నారు. బిసి కుల వృత్తుల ఆర్థిక సహాయంపై క్యాబినెట్ సబ్ కమిటి నివేదిక ప్రకారం మార్గదర్శకాలు అందిస్తామని దాని ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో సాధించిన ప్రగతి, కొత్త ఆసుపత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు సేవలను వివరించాలని, వైద్య, ఆరోగ్యశాఖ దినోత్సవం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటాలని సీఎస్ అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేయాలని, సఫాయి అన్న సలాం అన్న అనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికి త్రాగునీటి సరఫరా, గిరిజనోత్సవం, పెరిగిన పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి పక్కాగా తెలియజేయాలని, ఆధ్యాత్మిక రంగంలో సాధించిన ప్రగతి, అమరుల సంస్కరణ కార్యక్రమాలు పకడ్బందీగా జరగాలని అన్నారు. విడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జూన్ 2న ఉదయం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి కలెక్టరేట్ ప్రాంణంలోని పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీఓ రాములు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ నెలలు ఔషధ సుగంధ ద్రవ్య పంటలకు అనుకూలం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ చీనా



సమావేశానికి హాజరైన రైతులు , మహిళలు

**- వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఔషద మొక్కల నాణ్యత అధికం**

**- రాజేంద్ర నగర్ ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ డా.చీనా**

**- మోజర్ల ఉద్యానవన కళాశాలలో రైతులకు ఔషధ మొక్కల సాగుపై శిక్షణ**

**పెద్దమందడి, మే29, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణప్రాంతంలోని వ్యవసాయ వాతావరణం ధాన్య పంటలైన ఔషధ సుగంధ ద్రవ్య పంటల సాగుకు అత్యంత అనుకూలమని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చీనా అన్నారు. పెద్దమందడిమండలం మోజర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన రైతులకు శిక్షణకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తక్కువ వర్షపాతం ఉన్నప్రాంతాల్లో ఔషధ మొక్కలు సుగంధ ద్రవ్య పంటలలో నాణ్యత ఎక్కువగా ఉంటుందని ఎక్కువయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ అని కాబట్టి రైతులు వీటి సాగుకు మొగ్గ చూపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ పంటల సాగులో ఎక్కువ మంది రైతులు లేకపోవడం వల్ల సాగు చేస్తున్న రైతులు విత్తనాలను సైతం తామే ఇతరులకు అందించి అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. అశ్వగంధ, నిమ్మగడ్డి, ఈ పెద్దమందడి ప్రాంతంలో బాగా వస్తుందని పేర్కొన్నారు. రైతులు సంఘటితంగా నూనె తీసే యంత్రాలు కొనుగోలు చేసుకోవచ్చని, ఉద్యాన శాఖ సైతం ఎందుకు సబ్సిడీ ఇస్తుందని ఆయన చెప్పారు. వర్షాధార ప్రాంతాల్లో సైతం లాభసాటిగా పండించగలిగే పంటలు, ఔషధ మొక్కలని దక్షిణ తెలంగాణ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్త, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. వరి వంటి దీర్ఘకాలిక పంటలతో పోలిస్తే తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పని దినాలతో చిన్న , సన్నకారు రైతులకు ఔషధ, సుగంధ పంటల సాగు అత్యంత అనుకూలమని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేషన్ డాక్టర్ పిడిగం సైదయ్య చెప్పారు. రైతులు ముందుకు వస్తే కళాశాల నుండి ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు ఈ పంటలపై శిక్షణ ఇప్పిస్తామని ఆయన రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది రైతులకు ఉచితంగా అశ్వగంధ విత్తనాలు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో మోజర్ల సర్పంచ్ సునీత తిరుపతయ్య, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, ఏఈవో చిన్న రాయుడు, రైతులు , మహిళలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం..

**హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అబ్రహం**



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం,



అధికారులతో ఎమ్మెల్యే అబ్రహం,

**అయిజ, మే 29 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధి తమ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడిదొడ్డి గ్రామం, చిప్పదొడ్డి గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై 3.55 కోట్ల రూపాయలతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ప్రజలు లబ్ది పొందే విధంగా కృషి చేయడం జరుగుతుంది. ప్రతి ఇంటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం నేరుగా చేరడం జరుగుతుంది. అదేవిధంగా రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కొరకు అనేకమైన సంక్షేమ పథకాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగింది. అలా అనేకమైన కార్యక్రమాలను గ్రామాలలో నిర్వహించి అదేవిధంగా గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేయడం జరుగుతుంది. గతంలో పోలిస్తే గ్రామాలు ఇప్పుడు అభివృద్ధి చెందుతున్నాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కెసిఆర్‌తో సాధ్యమవుతుందని అన్నారు. కాంట్రాక్టర్ పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామంలోని ప్రజలు గ్రామ అభివృద్ధి చెందాలంటే అందరు కలసి మెలిసి ఉండాలి అప్పుడే మన గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మాజీ సింగిల్ విండోఅధ్యక్షులు సంకపురం రాముడు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ

**రూ. 2 లక్షల భీమా చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే**

**కెటిదొడ్డి, మే 29 ప్రభాతవార్త :** సోమవారం గద్వాల నియోజకవర్గంలో కెటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త హరిజనస్వామి పాముకాటు ప్రమాదంతో మరణించారు. 2 లక్షల ప్రమాదభీమా ఉన్న బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం చేయించుకున్న స్వామి కొన్నిరోజుల క్రితం ప్రమాదవశాత్తు చనిపోయాడు. వారి ఇంటికి వెళ్లి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా భార్య హరిజన పద్మమ్మకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కెసిఆర్ పేద కార్యకర్తలు ప్రతి కష్టానికి ఓర్చుకుని పార్టీ జెండా మోసేవారికి అండగా నిలిచేందుకు కార్యకర్తల కష్టాలను దగ్గరుండి చేసిన మన నాయకుడు ఎవరికి రాని ఎవరు చేయని విధంగా



భీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

బిఆర్ఎస్ పార్టీ అధినాయకుడు పేద కార్యకర్తలకు అండగా ఉండటానికి రెండు లక్షల ప్రమాద భీమా ఉన్న పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు కొంత ఆర్థిక సహకారం అందించాలనే ఉద్దేశంతో కార్యకర్తలకు సభ్యత్వంతో పాటు ప్రమాద భీమాను కూడా అందించారు. అదే స్ఫూర్తి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడానికి దోహదమైనది. రైతుభీమా లాంటి అద్భుత పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కూడా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన వారికి ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి అండగా ఉంటూ ధైర్యం కల్పిస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, కొండాపూర్ ఎంపిటిసి శేఖర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కెటిదొడ్డి మండల అధ్యక్షులు ఉరుకుందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, చక్రధర్‌రావు, రాజేష్, శేఖర్‌రెడ్డి, విష్ణుచిత్తుడు, టీచర్ గోవిందు, వీరేష్, ఆర్. వీరన్న, గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటలలో సస్యరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలి



తోటలను సందర్శిస్తున్న దేశి ట్రైనర్ సురేష్

**ధరూర్, మే 29 ప్రభాతవార్త :** పంట సస్యరక్షణలో తగిన జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని దేశి ట్రైనర్ సురేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా మల్దకల్ మండలంలోని శేషంపల్లి గ్రామంలో నిమ్మ, బత్తాయి, కరివేపాకు, మునగ, జాము, మామిడి, తోటలో దేశి డీలర్లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ తోటలపై ఏతోట ఎన్ని సంవత్సరాలు వస్తున్నాయి, ఎంత పెట్టుబడి అవుతుంది అలాగే దిగుబడి ఎంత వస్తుంది, ఏఏ తోటలో ఏఏ తెగుళ్ల వస్తున్నాయి, ఎప్పుడు వస్తున్నాయి అని వివరించారు. ఈ తోటలలో ఎలాంటి తెగుళ్ల వస్తే దానికి తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. రైతులకు సాగు చేస్తున్న తోటలపై క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆయా తోటసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల, చీడపీడల నివారణపై దేశ డీలర్లకు, రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు అధిక లాభాలు ఆశించవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో దేశి డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లర్స్ యజమానులు

**- తరుగు పేరుతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన**



రైస్ మిల్ దగ్గర ఆగిఉన్న వడ్ల లారీలు

**వీపనగండ్ల, మే29, ప్రభాతవార్త:** తరుగు పేరుతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చేస్తున్న ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని చుట్టు పక్కల ఉన్న రైస్ మిల్ యజమానులు రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక బస్తాలో 41 కిలోల 200 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా 41 కిలోల 300 గ్రాములు వరకు తూకం వేస్తుండగా తరుగు పేరుతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చేశారు. రైతులను రైస్ మిల్ యజమానులు మోసం చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల రైస్ మిల్ యజమానులు రెచ్చిపోతున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైస్ మిల్లర్లను కట్టడి చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం ఉండగా , 14 తేమ శాతం ఉంటేనే రైస్ మిల్లర్లు లారీలో ఉన్న వడ్ల లోడును డంప్ చేసుకుంటున్నారని రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు.